'వార్త'కు స్పందన

ఉపాధి హామీ కూలీలకు నీరు, షెడ్ నెట్ ఏర్పాటు చేసిన సర్పంచ్

అక్కన్నపేట, మార్చి 10, ప్రభాతవార్త :

అక్కన్నపేట మండలం కుందన్ వాణిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గ్రామ సర్పంచ్ ఎంకవ్వసమ్మయ్య మంగళవారం రోజున నీటి సౌకర్యంతో షెడ్ నెట్ ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు తగిన సౌకర్యాలు లేవని వార్తాపత్రికలో వచ్చిన నేపథ్యంలో దీనిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో షెడ్ నెట్ ఏర్పాటు చేయడంతో పాటు నీళ్ల క్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎండ తీవ్రతను బట్టి పనులను ముగించుకుని వెళ్లాలని, తరచూ నీరు తాగుతూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రమేష్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ కుందన రాధిక తిరుపతి, ఆశ వర్కర్ గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



నెంటూర్ నుంచి భద్రాచలానికి గోటి తలంబ్రాలు

-108 కలశాలతో గోటి తలంబ్రాల ఊరేగింపు

వర్గల్, మార్చి 10 (ప్రభాతవార్త): భద్రాచల సీతారాముల కళ్యాణానికి అందించే గోటి తలంబ్రాల కార్యక్రమం కోటి తలంబ్రాల దీక్ష హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం వర్గల్ మండలం నెంటూర్ గ్రామంలో గోటి తలంబ్రాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భద్రాచలం నుండి తీసుకువచ్చిన గోటి తలంబ్రాలు 108 కలశాలలో నింపి రామనామ స్మరణ చేసు కుంటూపురవీధులగుండా కాషాయ జెండాలు, కలశాలతో భారీ ర్యాలీతో పోచమ్మ దేవాలయం నుండి హనుమాన్ దేవాలయానికి చేరుకొని వడ్లను ఒలిచేకార్యక్రమాన్ని ప్రారంభించారు. రామకోటి రామరాజు భక్తులచే మూడు గంటల పాటు రామనామ స్మరణ చేయిస్తూ గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలుగా మార్చారు. భద్రాచల శ్రీరాముని కళ్యాణానికి ఈసంవత్సరం 3క్వింటాళ్ల గోటి తలంబ్రాలను అందించడం జరుగుతుందన్నారు. గోటి తలంబ్రాల దీక్షలో భాగస్వామ్యమైన భక్తులు రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి

రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, మార్చి 10, ప్రభాతవార్త : మండల కేంద్రంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యాచరణను ప్రతి గ్రామంలో విజయవంతంగా అమలుచేయాలని సూచించారు. మొదటగా ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను త్వరితగతిన క్లియరెన్స్ చేయాలని అధికారులకు ఆదేశించారు. అక్కన్నపేట మండలంలోని ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయాలని, పోలీస్, రవాణా శాఖలు కలిసి రోడ్డు భద్రతపై అరైవ్ అలైవ్ సురక్షి తం" కార్యక్రమాన్ని నిర్వహించాలని, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సన్న బియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలకు అర్హత ఉన్నా ఇంకా అందని వారిని గుర్తించి జాబితా తయారు చేయాలని అధికారులకు సూచించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగాన్ని నిర్మూలించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో రోడ్డు భద్రత పెంచేందుకు సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు హెల్మెట్లు అందిస్తున్నామని, 18 సంవత్సరాలు పూర్తి చేసిన యువకులకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో పంటల మార్పిడి పద్ధతులను శాస్త్రీయవేత్తల సలహాలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణానికి కృషి చేయాలని, మహిళా సంఘాలకు అందించిన స్టీల్ బ్యాంక్‌లను వినియోగించాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా తక్షణ చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలపై కూడా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు...

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని కెజెఆర్ గార్డెన్‌లో మంగళవారం సాయంత్రం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతి, సామరస్యానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

హుస్నాబాద్ రూరల్, మార్చి 10, ప్రభాతవార్త

ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమా లపై ప్రజలకు అవగాహన కల్పించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో పర్యటించి పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం నిర్వహిస్తున్న ఎఫ్ఎండి టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే గ్రామం లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి పరమేశ్వర సిమెంట్ బ్రిక్స్ ఇండస్ట్రీని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు సంపదను పెంచడం, వచ్చే వ్యాధులను నివారించడానికి ఆరు నెలలకు ఒకసారి టీకాలను ఉచితంగా వేస్తున్నామని, పాడిపంట వ్యవసాయానికి అనుబంధంగా ఆవుల పెంపకం ఎంతోకాలంగా కొనసాగు తున్నదని, రైతులు పాడిసంపదను పెంచి పాల ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతులు ఆవులు, బర్రెలు పెంచితే పాలు మాత్రమే కాకుండా ఎరువులకు ఉపయోగపడే పేడా లభిస్తుందని, ఇది రైతులకు అదనపు ఆదాయం అందిస్తుందని చెప్పారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతి గ్రామంలో అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, స్టీల్ బ్యాంక్లను వినియోగించుకోవాలని కోరారు. ప్రైవేట్‌లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగా లని, ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపి ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఈవిఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

ఈవిఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

కలెక్టరేట్ సమీపంలోగల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవిఎం) గోదాంను మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి పరిశీలించారు. త్రైమాసిక పరిశీలనలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఈవిఎం గోదాంను ఓపెన్‌చేసి సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల వారీగా మిషన్‌లను భద్రపరిచిన ద్వారాలను వాటికి వేసి సీల్‌లను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం అన్ని భద్రతాచర్యలు తీసుకుంటున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. గోదాం లోపల, బయట, చుట్టు పరివారం మొత్తం ప్రతిదీ సిసి కెమెరాలో నిక్షిప్తం అవుతాయని తెలిపారు. విజిటర్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం గోదాం అందరి సమక్షంలో ముఖ ద్వారానికి తాళం వేసి సీల్ వేశారు. ఈ పూర్తి ప్రక్రియ వీడియో గ్రఫీ తీశారు. కార్యక్రమంలో డిటి బాలరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రీ సర్వే

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎం.నగేష్

రామాయంపేట, మార్చి 10, ప్రభాతవార్త : భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ ఎం.నగేష్ అన్నారు. మంగళవారం రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 సంవత్సరాల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్షను రూపొందించడం జరిగిందన్నారు. అప్పటినుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షల్లో సమస్యలు తలెత్తయని చెప్పారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీసర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్‌లైన్ డిజిటలైజేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ఎలాంటి భూ వివాదాలు లేకుండా చేసి, భూమికి భూధార్‌ను అందించడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో 24 గ్రామాల్లో భూ రీసర్వేను శాస్త్రీయంగా నిర్వహించి, రైతుల భూహక్కులను పరిరక్షిస్తామని తెలిపారు. భూ రీ సర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వాళ్లు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, ఎడి ల్యాండ్ సర్వే కిషన్, డిపి ఆర్ఓ రామచంద్ర రాజు, తహసీల్దార్ రజనీకుమారి, ఎంపీడీవో షాజీలొద్దీన్, సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి : అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కొమురవెల్లి, మార్చి 10,ప్రభాతవార్త : మండల పరిధిలోని మరిముచ్చాల గ్రామంలో మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ పాల్గొని గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షించారు. గ్రామాభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, ఎంపిడివో, ఎంపిఓ, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, అశా వర్కర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కో-ఆప్‌రేటివ్ సొసైటీలకు రూ.1000 కోట్లు కేటాయించాలని మంత్రికి వినతి

హుస్నాబాద్ టౌన్, మార్చి 10 ప్రభాతవార్త: రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సంఘాల అభివృద్ధి, సంక్షేమ సమాఖ్య ప్రతినిధులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కోరారు. మంగళవారం హుస్నాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కోఆప్‌రేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అనుబంధంగా ప్రాథమిక విశ్వబ్రాహ్మణ కోఆప్‌రేటివ్ సొసైటీలను 1964 సహకార చట్టం ప్రకారం ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం ఉందని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వద్ద ఆన్‌లైన్ ద్వారా 11 నుంచి 15 మంది సభ్యులతో ప్రాథమిక సొసైటీలు ఏర్పాటుచేసి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, గత సంవత్సరం నుంచి సొసైటీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ సీసీజీ విధానాన్ని నిలిపివేయ దంతో కొత్త సొసైటీల నమోదు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం కోఆపరేటివ్ సొసైటీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునః ప్రారంభించాలని, 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో విశ్వ బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీలకు రూ.1000 కోట్లు కేటాయించి వాటి ద్వారా విశ్వ బ్రాహ్మణు లకు ఉపాధి, వృత్తిపరమైన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తొవిటి సదానందచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరి విద్యాసాగర్, రాష్ట్ర కోశాధికారి కాసుల కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోలోజు రాజ్‌కుమార్ చార్యులు, రాష్ట్ర కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షు రాలు మాచనపల్లి కవిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్యోతి రాణి, మాచనపల్లి రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఖాకీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ రష్మీ పెరుమాళ్

పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సిపి రష్మీ పెరుమాళ్

సిద్దిపేట రూరల్, మార్చి 10, ప్రభాతవార్త :

సిద్దిపేట పోలీసు కమి షనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం మంగళ వారం ఆరోగ్య ఖాకీ-పోలీసు వెల్నెస్ అండ్ ఫిట్నెస్ ఇనిషియేటివ్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం సీపీ కార్యాల యంలో సీపీ రష్మీ పెరుమాళ్ హెల్త్ ప్రొఫైలింగ్ ప్రక్రయను ప్రారంభించారు. సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యుల బృందం 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ 24 గంటలో విధి నిర్వహణలో ఉండే పోలీసులు సమాజంలో ఎక్కడ సమస్య తలెత్తినా అక్కడికి వెళ్తారని తెలిపారు. పోలీసులు ఎల్లప్పుడూ మానసికంగా, శారీరకంగా, ఫిట్‌గా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారికి ఒక వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్ రూపొందిచబడుతుందన్నారు. రిపోర్టుల ఆధారంగా ఎవరికైనా అనారోగ్య సూచనలు ఉంటే వెంటనే వారిని అప్రమత్తం చేసి తగిన వైద్య సలహాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్‌చంద్రబోస్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ధనరాజ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురుష్‌బాబు, ఆర్ఎంఓ జి.అనిల్, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌గుప్తా

కొల్చారం, మార్చి 10 ప్రభాతవార్త: మండల కేంద్రానికి చెందిన ఆరుగొండ శ్రీధర్‌గుప్తా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మెడికల్ హెల్త్ వింగ్ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు జూలకంటి సంగమేశ్వర్(కండక్టర్) అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జూలకంటి సంగమేశ్వర్ మాట్లాడుతూ, శ్రీధర్‌గుప్తా సామాజిక సేవా దృక్పథం, వైద్య రంగంలో చూపుతున్న నిబద్ధత, నాయకత్వ నైపుణ్యాలు మరింత ప్రజాసేవకు దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యానికి సేవచేయాలనే లక్ష్యంతో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అదేవిధంగా ఆయన రాజకీయ ప్రయాణం వ్యాపార రంగంలో అభివృద్ధి మరింత శ్రేణులకు చేరాలని మనస్పూర్తిగా కోరుకుంటూ, భవిష్యత్తులో ప్రజలకు సేవ చేసే అవకాశాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి : ఎఐటియుసి

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి10, ప్రభాతవార్త : సంగారెడ్డి గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుల మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జి డిపిఓ కె.జానకిరెడ్డికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంఎ.రహమాన్ బి.వెంకటరాజ్యం గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు వారి ఎకౌంట్లో పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీగా డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్స్ కార్మికులు యేసయ్య పెంటయ్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

26న బార్ అసోసియేషన్ ఎన్నికలు

గజ్వేల్, మార్చి 10 (ప్రభాతవార్త): ఈనెల 26న గజ్వేల్ బార్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వాహకులు, న్యాయవాది ప్రశాంత్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని కోర్టు ప్రాంగణంలో ఎన్నికల గురించి నోటిఫికేషన్ విడుదలచేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. గజ్వేల్ కోర్టు పరిధిలో పనిచేస్తున్న 78 మంది న్యాయవాదులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శికి సంబంధించిన పదవులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు మూడు రోజులపాటు అవకాశం కల్పించినున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోపాల్‌రావు, వివి.రమణ, కాశీప్రసాద్, ఏపిఎస్ రాజు, వి.శ్రీనివాస్, గడీల శ్రీనివాస్, కిరణ్, భాగయ్య, పందరి, సుదర్శన్, కనకయ్య, ఉమారాణి, అనూష, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్‌కు మాతృవియోగం

కొల్చారం మార్చి 10 ప్రభాతవార్త : మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ నింగోల చెన్నయ్య తల్లి నింగోల నాగమ్మ అనారోగ్యంతో మంగళవారం ఉదయం 11 గంటలకు కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే చికిత్స పొందుతూ ఉండగా ఆమె తుదిశ్వాస విడిచారు. నాగమ్మ మృతి వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు నింగోల చెన్నయ్య నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తల్లిని కోల్పోయిన చెన్నయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మృతి చెందిన నింగోల నాగమ్మ అంత్యక్రియలు గ్రామంలోని శ్మశానవాటికలో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తుల సమక్షంలో విషాద వాతావరణంలో నిర్వహించారు. అమ్మను కోల్పోయిన బాధతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

పాపన్నపేట, మార్చి 10, ప్రభాతవార్త : ఓ యువతిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన సంఘటన ఏడుపాయల చెలిమెల కుంట వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... కొడుపాక గ్రామానికి చెందిన బ్యాగరి సులోచన(35) కొన్నేళ్ల క్రితం భర్త మృతి చెందడంతో కూలీపనులు చేసుకుంటూ జీవనంసాగిస్తుంది. కాగా సోమవారం ఉదయం ఇంట్లో నుంచి కూలీ పనుల కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఇంటి వద్దఉన్న కుమారుడు రాజేష్ బంధువులకు సమాచారం అందించాడు. చుట్టుపక్కల వాకబుచేయగా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం స్థానికులు ఏడుపాయల సమీపంలోని చెలిమకుంట వద్ద వెళ్లగా అనుమానాస్పదస్థితిలో ఒక మహిళ మృతదేహన్ని గుర్తించి వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతురాలి ముఖంపై కర్రతో దాడిచేసిన బలమైన గాయం ఉండడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని నిర్ధారిస్తున్నారు. మృతురాలి సోదరుడు దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండపాక, మార్చి 10, ప్రభాతవార్త : ట్రాలీ ఆటో ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజీవ్ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున రవీంద్రనగర్ వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... అదే గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కొడెల కిరణ్ తండ్రి కొడెల నర్సయ్య(50) రోజు మాదిరిగానే పొలం వద్ద ఉన్న గేదెలకు పాలు పిండడానికి వెళ్తుండగా అదేసమయంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో వెనుకనుంచి ఢీకొట్టగా నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా నర్సయ్య అంత్యక్రియల్లో బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, అనంతుల ప్రశాంత్ పాల్గొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ అంత్యక్రియల కోసం రూ॥ 10 వేలను ఆర్థిక సహాయంగా అందించారు. వారి వెంట నాయకులు ర్యాగల దుర్గయ్య, కొడెల మల్లెశం, మల్లెశం, బొద్దుల తిరుపతి, ఐలయ్య,శేఖర్, నూనె కుమార్, కొడెల రవి పాల్గొన్నారు.

చేర్యాలలో రెండుచోట్ల చోరీ

చేర్యాల, మార్చి 10, ప్రభాతవార్త : రెండు వేరువేరు చోట్లలో గుర్తు తెలియని దుండగులు చోరికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని గాంధీ సెంటర్‌లోని భాస్కర్ సెల్ షాపుతో పాటు కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఓఇంట్లో దుండగులు చొరబడి చోరీలకు పాల్పడినట్లు సమాచారం. మంగళవారం షాపు,ఇంటిలో దొంగతనం జరిగినట్లు బాధితులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్లు, నగదు ఎంత చోరీ జరిగిందన్న విషయం తెలియాల్సి ఉంది.

మొబైల్ షాపు పైభాగం రేకుల కట్ చేసి చోరీకి పాల్పడిన గుర్తు తెలియన దుండగులు

'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 10, ప్రభాతవార్త

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు విజయవంతంగా అమలు చేయడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకమని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 12వ తేదీన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌లకు ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం ద్వారా పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించబడుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంచేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 99రోజుల కార్యాచరణకు ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేయబడిందని, దాని ప్రకారం జూన్ 12వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి అన్నిజిల్లాల అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని సిఎస్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వఅధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, అలాగే సర్పంచులకు 2018 పంచాయతీ రాజ్ చట్టంపై, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్‌లకు 2019 మున్సిపల్ చట్టంపై, అదేవిధంగా వారి విధులు, బాధ్యతలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లాఅధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ఈ నెల 12వ తేదీన ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సిఎస్‌కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అడిషనల్ కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, సీపీఓ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ కేంద్రాలను బలోపేతం చేయాలి...

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 10, ప్రభాతవార్త

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐ కేంద్రాలను బలోపేతం చేసి ఆధునిక మోలిక వసతులు కల్పించడం, కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీఎం సేతు ప్రాజెక్టు కింద ఐదు ఐటీఐలను హబ్ అండ్ స్పోక్స్ విధానం లో అభివృద్ధి చేసి పరిశ్రమల సహకారంతో ఐదేళ్ల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక యంత్రాలు, మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి ఏర్పాటు చేసి ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. సమీక్షలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రాజా, ఐటిఐప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, సీఎం సేతు కన్సల్టెంట్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వర కళ్యాణం

పాపన్నపేట, మార్చి 10, ప్రభాతవార్త:
మండల పరిధిలోని అబ్లాపూర్‌లో మంగళవారం పద్మావతి సహిత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శివపార్వతుల కళ్యాణ వేడుకలు కనులపండువగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు నీరుడి లక్ష్మమ్మ నారాయణ దంపతుల అధ్వర్యంలో జరిగిన పదవ వార్షికోత్సవ వేడుకలకు రంగంపేట పీఠాధిపతి మాధవానందసరస్వతి ముఖ్యఅతిథిగా విచ్చేసి, వేడుకలో పాల్గొన్నారు. వివిధప్రాంతాల నుండి వచ్చిన మహిళలు, భక్తులు కళ్యాణవేడుకను తిలకించి, అక్షింతలు వేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

-నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దివ్య

అర్బన్‌పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు, ఫారెస్ట్ అధికారులు

నర్సాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
విద్యార్థులు సైతం పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దివ్య అన్నారు. మంగళవారం 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిఎస్ఐ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మెదక్ బిఎడ్ విద్యార్థులు నర్సాపూర్ అర్బన్‌పార్క్‌లో నేషనల్ గ్రీన్ కార్ప్స్ పర్యావరణ విద్య కార్యక్రమంలో భాగంగా బిఎడ్ విద్యార్థులు అర్బన్ పార్క్‌ను సందర్శించారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని అర్బన్ పార్క్ పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధి రామ్‌సింగ్, ఎఫ్ఎస్ఓ సాయిరామ్, కరీముద్దీన్, శ్రీధర్, రాజమణి, ఎఫ్‌బిఓలు గోపాల్‌రెడ్డి తదితరులు, అర్బన్ పార్క్ సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల పేరిట రైతుల భూములు తీసుకోవొద్దు

-మండల తహసీల్దార్‌కు వినతిపత్రం

గుమ్మడిదల, మార్చి 10, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం సర్వే నంబర్ -261 గ్రామానికి చెందిన రైతులు తమ పంట భూములను పరిశ్రమల కోసం స్వాధీనం చేసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిజిఐసి పరిశ్రమల స్థాపన కోసం తమభూములను తీసుకోవాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం మండల తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తరతరాలుగా సాగుచేసుకుంటూ జీవనాధారంగా ఉన్న పంట భూములను పరిశ్రమల కోసం తీసుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈనిర్ణయాన్ని పునరాలోచించి రైతులకు న్యాయంచేయాలని కోరారు. అన్నారం సర్వేనంబర్-261 రైతులు ఐక్యంగా తమహక్కులకోసం పోరాటంకొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం

-ఎంపిడిఓ విఘ్నేశ్వర

వెల్దుర్తి, మార్చి 10, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన మాసాయిపేటలో మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మురుగు కాలువలు శుభ్రం చేయడం జరిగిందని స్థానిక ఎంపిడిఓ విఘ్నేశ్వర్, గ్రామ కార్యదర్శి రాణమ్మ తెలిపారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని దశల వారీగా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని వారన్నారు.

వెల్దుర్తి నూతన ఎంఈఓగా బుచ్చానాయక్

వెల్దుర్తి, మార్చి 10, ప్రభాతవార్త:
మండల విద్యాధికారిగా బుచ్చానాయక్ మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులను సాంబయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సృజన, ఉపాధ్యాయులు వెంకటస్వామి, నరసింహారెడ్డి, చార్లెస్, రాజు, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

టేక్మాల్‌లో ఘనంగా బండిషీడి ఉరేగింపు

టేక్మాల్‌లో ఘనంగా బండిషీడి ఉరేగింపు చేస్తున్న దృశ్యం

టేక్మాల్, మార్చి 10, ప్రభాతవార్త:
టేక్మాల్ గ్రామంలోని దుర్గమ్మ, పోచమ్మ గ్రామ దేవతల ఉత్సవాల్లోనభాగంగా బండిషీడి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడో రోజు అమ్మవార్లకు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బండిషీడి ఊరేగింపు ఆనవాయితీగా గొల్లగూడెంనుండి బండిషీడిలో అమ్మవారి విగ్రహాన్ని కూర్చోబెట్టి డప్పుచప్పుళ్ల మధ్య, ఆటపాటలు ఎంతగానో అకట్టుకున్నాయి. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను తీసుకున్నారు. ఉత్సవాలల్లోనినాయకులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర మహోన్నతమైంది

-పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్‌రెడ్డి

నర్సాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
సమాజంలో మహిళల పాత్ర మహోన్నతమైందని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పిఆర్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్‌రెడ్డి హాజరవ్వగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్‌లు హాజరయ్యారు. ఈమేరకు మహిళా ఉద్యోగులకు సన్మానంచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సామ్యనాయక్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇందిరా, జ్యోతి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫరానా బేగం ఉపాధ్యాయులు శిల్ప, శ్రీజ్యోతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

రుస్తుంపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

నర్సాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామంలో గ్రామ సర్పంచి ఈటూరి వర్షసుదీప్ ఆధ్వర్యంలో గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచి ఈటూరి వర్షసుదీప్, ఉపసర్పంచి వీరేశం, వార్డుసభ్యులతోపాటు మాజీ ఆత్మకమిటీ చైర్మన్ ఈటూరి శివకుమార్ సమక్షంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఈ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఆలయం పక్కనుండి పంబళ్ల పరమేష్ ఇంటివద్ద ఉన్న కందకంవరకు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు త్వరితగతిన ఈ పనులను చేపట్టి పూర్తి చేస్తామని సర్పంచ్ వర్షసుదీప్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఈటూరి వర్షసుదీప్, ఉపసర్పంచి వీరేశం, వార్డుసభ్యులు గొల్ల పద్మకృష్ణ, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు వేయించిన సర్పంచి

కొండాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
కొండాపూర్ మండలపరిధిలోని గుంతపల్లిగ్రామ సర్పంచి పడమటి అనంత రెడ్డి గ్రామ అభివృద్ధి పట్ల తన నిబద్ధతను చాటుతూ మంగళవారం తన సొంతనిధులతో బోరువేయించారు. డ్వాక్రా మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు లక్షాయాభైవేల రూపాయల వ్యయంతో ఈ బోరును ఏర్పాటుచేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధికోసం తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టిజిఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఇతర అధికారులు

సంగారెడ్డిమున్సిపాలిటీ, మార్చి 10, ప్రభాతవార్త:
సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో టిజిఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి నియోజకవర్గంలోని విద్యారంగ అభివృద్ధిపై సంక్షేమశాఖ అధికారులు టిజిఈడబ్ల్యు ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, ప్రిన్సిపాల్స్, ఆర్‌సిఓలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి నియోజకవర్గంలోని అన్నిప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కెజిబివి), గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన కొత్త తరగతిగదులు, భవనాలు, వంటి మౌలిక సదుపాయాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధంచేయాలని తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ లోపు సంబంధితశాఖలు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. పరిశ్రమల సహకారం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతుల నిర్మాణపనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అద్దెభవనాల్లో నడుస్తున్న వసతిగృహాలను సొంతభవనాల్లోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని తెలిపారు. జిల్లాలోని కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలలు, కళాశాలల్లో తగిన భద్రతాచర్యలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న కళాశాలలు, వసతి గృహాల వివరాలను సేకరించి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా టిజిఐసి చైర్మన్ నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డినియోజకవర్గంలో విద్యాభివృద్ధికి పరిశ్రమల సహకారం ఎంతో అవసరమన్నారు. జిల్లాలో విద్యనభ్యసించేందుకు ఇతర ప్రాంతాల నుండి కూడా అనేకమంది విద్యార్థులు సంగారెడ్డికి వస్తున్నారని, అందువల్ల విద్యాసంస్థల వద్ద తగిన వసతి సదుపాయాలు కల్పించడం అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఓ బాలశౌరి, సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేష్‌రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి జగదీష్, పంచాయతీరాజ్ ఎస్సీ జగదీష్, ఈడబ్ల్యు ఐడిసి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితసంతోష్ కుమార్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్‌రెడ్డి, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్

పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగేశ్‌శెట్కార్

నారాయణఖేడ్, మార్చి 10, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో ఈ నెల 18న జరగనున్న ముస్లింల పండుగ రంజాన్ (ఈద్) సందర్భంగా ఈద్గాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేశ్‌శెట్కార్ పరిశీలించారు. ఈసందర్భంగా ముస్లింల నమాజ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నమాజ్ సమయంలో ప్రాంతం శుభ్రత, తాగునీటి సౌకర్యం, ఇతర అవసరమైన ఏర్పాట్లు పూర్తిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఖేడ్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, కౌన్సిలర్లు వివేకానంద, మహేందర్, లక్ష్మణ్, బాణపురం రాజు, షారుఖ్, మైతబ్, గోపాల్‌రెడ్డి, విట్టల్, సుబర్, ఆనంద్ స్వామిసమద్, అసిఫ్, సఫి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలను నిరోధించడంలో సిసి కెమెరాల పాత్ర కీలకం

-ఎస్పీ శ్రీనివాస్‌రావు..

కొల్చారం, మార్చి 10, ప్రభాతవార్త:
నేరాలను నిరోధించడం, గుర్తించడంలో సిసి కెమెరాల పాత్ర కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. కొల్చారంమండలం ఏడుపాయలకు వెళ్లే రహదారిలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలు ప్రారంభించారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి టీ జంక్షన్ నుండి రెండో బ్రిడ్జి వరకు కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో దుకాణాదారుల సౌజన్యంతో నూతనంగా 32 సిసి కెమెరాలు ఏర్పాటుచేశారు. వాటిని మంగళవారం మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతోపాటు భద్రతాచర్యలను పెంపొందించేందుకు సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా

-ఎవో ర్యూన్సీ

వెల్దుర్తి, మార్చి 10, ప్రభాతవార్త:
ఉమ్మడి మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేయడం జరిగిందని స్థానిక ఈవో ర్యూన్సీ తెలిపారు. మంగళవారం నాడు మండల కేంద్రంలోని పిఎసిఎస్ యూరియా కొనుగోలు కేంద్రాలను స్థానిక ఇన్చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో ర్యూన్సీలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ యూరియాబస్తాలను ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువ విక్రయిస్తే చట్ట ప్రకారం వారిపైన చర్యలు తీసుకోక తప్పదని వారు హెచ్చరించారు. ఇప్పటివరకు మండలంలో 16,800 బస్తాలను రైతులకు సరఫరాచేయడం జరిగిందని ఆమె తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

స్వయంపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలోగల ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మహేశ్వరి వ్యవహరించగా, ఉపాధ్యాయులుగా రితిక, నిహారిక, శ్రావ్య, శ్రావణి, లోకేష్, వర్షిత్, నిశాంత్, వరునిక, దివ్యకీర్తిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవికుమార్‌తోపాటు ఉపాధ్యాయులు కృష్ణ సురేఖ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ టౌన్, మార్చి 10, ప్రభాతవార్త:
గజ్వేల్‌మండలం బయ్యారంగ్రామానికి చెందిన బడికల పెంటారెడ్డి మంగళవారం మృతిచెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారివెంట జగదేవ్‌పూర్ మండల పిఏసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, బిఆర్ఎస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్ మామిడి శ్రీధర్, స్వప్న సురేష్, నాయకులు ఖాజా విరాసత్‌అలీ, గుంటుకు రాజు, రహీం తదితరులు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్, మార్చి 10, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మండల్ సంజీవ్‌రావుపేట్ గ్రామానికి చెందిన ముస్సి రాజు అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేశ్‌శెట్కార్ మంగళవారం అంత్యక్రియల్లోపాల్గొని భౌతికదేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారితో నారాయణఖేడ్ నియోజికవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, చామకురా పాండు, వెంకగౌడ్, మాజీసర్పంచి నర్సింలు, సాయి చరణ్,గ్రామస్తులు ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

-బిజెపి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి

రామచంద్రాపురంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

రామచంద్రాపురం, మార్చి 10, ప్రభాతవార్త:
మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలోని తన నివాసంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి గోదావరి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో బిజెపి మహిళా జిల్లా అధ్యక్షురాలు మాధురిఆనంద్, కౌన్సిలర్ జిల్లా రాష్ట్ర పధాధికారులు, బూత్, పట్టణ, మండలాల నాయకులు పాల్గొన్నారు.

సిఎలో సీటు సాధించిన మయూర్ సారదాకు సన్మానం



మయూర్ సారదాను సన్మానిస్తున్న కౌన్సిలర్ దంపతులు

జహీరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:
పట్టుదలతో ఏకాగ్రతతో విద్యను అందుకుని కుటుంబ సభ్యుల ఆశయం నెరవేరేలా పట్టణానికిచెందిన మయూర్ సారద సిఏలో విద్యను అందుకునేందుకు సీటును సాధించారు. ఇటీవల విడుదలైన సిఏ ఫలితాల్లో 300 వందల మార్కులకు గాను మయూర్ సారదా 190 మార్కులు సాధించి సీటును సొంతం చేసుకున్నాడు. సిఏలో సీటును పొందిన మయూర్ సారదాను మున్సిపల్ చౌన్సిరల్ నామ స్రవంతి నామరవికిరణ్ మయూర్ సారద నివాసానికి చేరకుని శాలువాతో సన్మానించి మొమెంటోను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేల వర్క్ షాప్‌కు మాజరైన ఎమ్మెల్యే

జహీరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:
హైద్రాబాద్‌లోని గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో మంగళవారం ప్రారంభమైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వర్క్‌షాప్‌కు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరయ్యారు. వర్క్ షాప్‌లో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అవలంబించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

ఉచిత వైద్యశిబిరంలో చికిత్సలు

అల్లాదుర్గం, మార్చి 10, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఐ విజన్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ మద్దూరి సౌమ్య సతీష్ గౌడ్ ప్రారంభించారు. శిబిరానికి చేరుకున్న 250 మందికి పరీక్షలు నిర్వహించి 50 మందికి కంటి అద్దాలు పంపిణి చేశారు. నిర్వహించి చికిత్సలు అందచేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, నాయకులు సురేష్‌గౌడ్, బత్తిని రాందాస్, బేతయ్య, సుధాకర్, సతీష్, బసవరాజ్, కలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలి

-ట్రాన్స్‌కో ఎఈఈకి సర్పంచ్ వినతి

చౌటకూరు, మార్చి 10, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన చౌటకూరులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ పార్కల రాంరెడ్డి ట్రాన్స్‌కో ఏఈఈ సాయి రాఘవకు మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పార్కల రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేక విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, అటుగా వెళ్లిన వారు ఎక్కడ ప్రమాదాలకు గురవుతారో అన్న భయాందోళనలు నెలకొన్నాయన్నారు. పలు వీధులలో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి విద్యుత్ స్తంభాలు మంజూరుచేసి అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సర్పంచ్ పార్కల రాంరెడ్డి సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వ్యవస్థ బలోపేతం

-ఎపిఎం సంగమేశ్వర్

నర్సాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వ్యవస్థ బలోపేతం అవుతుందని ఎపిఎం సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ లోని మండల సమైక్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎపిఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల విలువలను వర్ణించలేమని అన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికపరంగా రాణించినప్పుడే ఈవ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా సీనియర్ సిఆర్పిలు మేఘన, షహనాజ్‌లు మహిళాసంఘాల బలోపేతం కమిటీల ఏర్పాటు, నిర్వహణ కమిటీల బలోపేతం, పనితీరు విధానంపై క్లుప్తంగా వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పాటల పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఉత్తమ మహిళా సిబ్బందికి శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిఆర్పిలు మేఘన, షహనాజ్, సిసిలు ప్రవీణ, రవీందర్, నర్సింలు, దేవిసింగ్ అకౌంటెంట్ మల్లేశం, మండలంలోని గ్రామసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అదనపు మిషన్ భగీరథ పైపులైను

అదనపు పైపులైను నిర్మాణం పనులను పరిశీలిస్తున్న దృశ్యం

జోగిపేట, మార్చి 10, ప్రభాతవార్త:
అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో తాగునీటి సమస్యను తీర్చేందుకు కౌన్సిలర్ కొరబోయిన సరస్వతీ చొరవ తీసుకొని అదనపు మిషన్ భగీరథ పైపులైను నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఈ వార్డులో శ్రీరాజరాజేశ్వర మందిరం వైపు ఉన్న ఇళ్లకు సరిగ్గా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవటంతో, వారి సమస్యను పరిష్కరించేందుకుగాను అదనంగా మరో పైపులైను నిర్మాణం చేపట్టారు. వేసవిలో తాగునీటి సమస్య మరింత ఎక్కువకానున్న సందర్భంలో ఈ పైపులైను నిర్మాణం చేయటంపట్ల వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ అదనపు పైపులైను వేయటం పూర్తయితే వార్డులో తాగునీటికి ఇబ్బందులుండవని, వార్డు ప్రజలు మాజీ కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు, కౌన్సిలర్ కొరబోయిన సరస్వతీలకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు. ప్రస్తుతం అదనపు పైపులైను నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి.

కాలువ దుర్వాసనకు శాశ్వత పరిష్కారం

-మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందారం నరసింహాగౌడ్

అమీన్‌పూర్, మార్చి 10, ప్రభాతవార్త:
బీరంగూడ డివిజన్ పరిధిలోని జయలక్ష్మినగర్, లక్ష్మిసాయి మెడోస్ కాలనీ మీదుగా వెళ్తున్న ప్రధాన మురుగునీటికాలువ మూలంగా వెలువడుతున్న దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ తెలిపారు. ఇటీవల రెండు కాలనీల ప్రజలు నందారం నరసింహాగౌడ్‌ను కలిసి కాలువను శుభ్రపరచకపోవడం వల్ల ప్రతిరోజు భరించలేని దుర్వాసనతోపాటు దోమలసమస్యను ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన నందారం నరసింహాగౌడ్ అమీన్‌పూర్ మున్సిపాలిటీ డిఈ వెంకటరమణకు సమస్యను వివరించారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి స్వయంగా రెండు కాలనీలలో నరసింహాగౌడ్ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అధికారులకు స్వయంగా చూపించారు. కాలువలను వెంటనే శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు విన్నవించారు. అతిత్వరలో సమస్యను పరిష్కరించి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని నరసింహాగౌడ్ ప్రజలకు హామీ ఇచ్చారు. నందవరం నరసింహాగౌడ్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాల్‌కల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

న్యాల్‌కల్, మార్చి 10, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో పారిశుధ్యం పనులు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ మాజీ చైర్మన్ సిద్ధలింగయ్యస్వామి, నాయకులు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, మక్సూద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని తొలగించాలి

-ప్రజావాణిలో నాగల్‌గిద్ద యువకుల ఫిర్యాదు

నాగల్‌గిద్ద, మార్చి 10, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన నాగల్‌గిద్ద పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి తొలగించాలని గ్రామానికి చెందిన యువకులు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ గ్రామస్థులకు అందుబాటులో ఉండకుండా అభివృద్ధి పనులను సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పలుమార్లు అధికారి దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిని విస్మరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై విచారణ నిర్వహించి విధుల నుంచి తొలగించాలని గ్రామ యువకులు డిమాండ్ చేశారు.

ఉప్పులింగాపూర్ శివారులో అక్రమంగా ఇసుక నిల్వలను సీజ్ చేసిన తహసీల్దార్

వెల్దుర్తి, మార్చి 10, ప్రభాతవార్త:
ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్లపేరిట ఇసుక అక్రమరవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్థానిక ఇన్చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్, నర్సింగ్‌యాదవులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామశివారులో అక్రమంగా ఇసుకడంపులు నిర్వహించారంటూ గ్రామస్థుల సమాచారంతో తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈతనిఖీలో అక్రమంగా నిర్వహించిన 50 ట్రాక్టర్‌ల ఇసుకను స్వాధీనం చేసుకోవటం జరిగిందని ఆయన తెలిపారు. ఎవరైనా నిరుపేదలు ఇల్లు కట్టుకునే వారు ఉంటే ముందస్తుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారికి ప్రభుత్వం నుండి ఇసుక ఇచ్చేందుకు అనుమతి ఇస్తామని అలా కాకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

పరిస్థితులకు తగ్గట్టు ముందుకుసాగాలి

-ప్రధానోపాధ్యాయులు ప్రసన్నవదన

టేక్మాల్, మార్చి 10, ప్రభాతవార్త:
ప్రస్తుతం ఉన్న సమాజంలో రకరకాలైన విపత్కర పరిస్థితులను సరిగ్గా అర్థంచేసుకొని ముందుకు సాగాలని పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల కుసంగిలో పిఎంశ్రీలో భాగంగా ఇంటరాక్షన్ విత్ రోల్ మోడల్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రచయిత, మోటివేటర్ రమాదేవి కులకర్ణి పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలను గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు అంతా విద్యార్థులదేనని, కావున అంది వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు దేశానికి సేవ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండురంగం, శంకర్, రమేష్‌గౌడ్, సుభాష్, నాగేందర్‌రెడ్డి విద్యార్థులున్నారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే వర్ధంతి

గజ్వేల్ టౌన్‌లో...

గజ్వేల్ టౌన్, మార్చి 10, ప్రభాతవార్త:
చదువులతల్లి సావిత్రిబాయిపూలే వర్ధంతిని గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం బిఆర్.అంబేద్కర్ డెవలప్మెంట్ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అటకూరి రాములు, ప్రధాన కార్యదర్శి మస్కూరి కిష్టయ్య, ఉపాధ్యక్షుడు మన్నె కృష్ణ, మాచపురం బాల్‌నర్సయ్య, మైసస్వామి, ఆశని కనకప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో...

జోగిపేట, మార్చి 10, ప్రభాతవార్త:
సావిత్రీబాయిపూలే వర్ధంతిని మంగళవవారం జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జోగినాథచౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహిళా విద్యకు ఆమెచేసిన త్యాగాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, ఎ.శంకరయ్య, దాసరి దుర్గేష్, నిరుడి లక్ష్మన్, మన్నె పరిపూర్ణం, లింగం, గడ్డం శంకర్, పల్లె నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నివాళులు అర్పించిన మాజీ చైర్మన్ నరోత్తం...

జహీరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:
సావిత్రీబాయిపూలే వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నరోత్తం, నాయకులు పూలమాలలువేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీసర్పంచి స్వామిదాస్, రాచన్న, శివకుమార్, యస్ గోపాల్, జి.మల్లేశం, భూమ్‌రెడ్డి, వెంకట్, చెంగల్ జైపాల్, సంగన్న, ఎం.జైపాల్, శ్రీనివాస్, మేగనాథ్, లాజర్‌లు పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

వేచరేణిలో ప్రజాపాలన...

చేర్యాల, మార్చి 10, ప్రభాతవార్త : మండలపరిధిలోని వేచరేణి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంగళవారం ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామంలోని రోడ్లు, మురుగు కాలువల శుభ్రపరచడం, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెర్గోజు నవీన్ కుమార్, వార్డు సభ్యులు ఏనుగుల ధనలక్ష్మి, దేవనబోయిన నరసింహులు, మాదాసు బాలమణి, బుద్ధి పర్షయ్య, పి. కృష్ణవేణి, తాడూరి మహేష్, పోలబోయిన స్వాతి పాల్గొన్నారు.

బస్‌స్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచుకుందాం

బస్టాండ్‌ను శుభ్రం చేపిస్తున్న స్టేషన్ మేనేజర్

హుస్నాబాద్ టౌన్, మార్చి 10, ప్రభాతవార్త : హుస్నాబాద్ బస్‌స్టాండ్‌కు వచ్చి వెళ్లే ప్రయాణికులు పరిశుభ్రత పాటించాలని స్టేషన్ మేనేజర్ లకవత్ హరినాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం 99 రోజుల ప్రజాపాలన – పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్ననాయక్ ఆదేశాల మేరకు బస్ స్టాండ్‌లోనూ, పరిసరాల్లో చెత్తను తొలగించడం, బాత్రూంలను శుభ్రం చేయడం వంటి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ హరినాయక్ మాట్లాడుతూ ప్రయాణికులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్త వేయడానికి బస్ స్టాండ్‌లో ప్రత్యేకంగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా బస్ స్టాండ్‌లో గార్డెన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఐ శ్రీ తిరుపతిగౌడ్‌తో పాటు ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయొద్దు : దండి లక్ష్మీ

చెత్తను తొలగిస్తున్న దృశ్యం

హుస్నాబాద్ రూరల్, మార్చి 10, ప్రభాతవార్త : ప్రజాపాలన-పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో 14, 16వ వార్డులలో పేరుకు పోయిన చెత్తను తొలగించి స్ట్రోమ్ వాటర్ డ్రైన్ల వద్ద స్క్రీనింగ్ బార్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పట్టణ పరిశుభ్రతను కాపాడాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని కోరారు. అందరూ కలిసి పట్టణాన్ని స్వచ్ఛ హుస్నాబాద్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మార్చి 10, ప్రభాతవార్త : గ్యాస్ సిలిండర్ ధరను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని సిపిఎం నాయకులు సత్తిరెడ్డి అన్నారు. మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు బొమ్మ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సిపిఎం కొమురవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం అంటే కేంద్ర ప్రభుత్వం మహిళలకు అనేకమైన రాయితీలు లేక బహుమతులు ఇస్తారని అనుకుంటే మహిళలపై పెద్ద గుదిబండ వేయడం ఏమిటి అని ప్రశ్నించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడూరు రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, తేలు ఇస్తారి, సార్ల యాదయ్య, కానుగుల రాజు, తాడూరి నరేష్, ఆరుట్ల రవీందర్, తాడూరి భరత్ కుమార్, ప్రవీణ్, లెనిన్‌బాబు, నర్సవ్వ, దయానంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేత

చిన్నకోడూరు, మార్చి 10,ప్రభాతవార్త : మండల పరిధిలోని అల్లీపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భూమవ్వ, కామ ఎల్లవ్వ, నర్సయ్య, మల్లయ్య కుటుంబీకులను మాజీ ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ మంగళవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు బాధిత కుటుంబీకులకు అందించిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్య, ఎల్లయ్య, దశరథం, బాలయ్య, యాదగిరి, తిరుపతి, శ్రీనివాస్, రాజు,కర్ణాకర్, రాంరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

హరికృష్ణను పరామర్శించిన మంత్రి వివేక్‌వెంకటస్వామి

సిద్దిపేట అర్బన్, మార్చి 10, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హైదారాబాద్‌లో చికిత్స చేసుకొని ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హరికృష్ణ త్వరగా కోలుకోవాలని మంత్రి అకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, కలీం, ఎల్లం యాదవ్, రాజబహాదూర్‌రెడ్డి, ఎర్ర మహేందర్, గాయజుద్దీన్, లక్ష్మీ, మహేష్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, ప్రవీణ్, రమేష్, వంశీ, అరవింద్ పాల్గొన్నారు.


హరికృష్ణను పరామర్శిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

రైతుభరోసా అందించాలి.. లేదంటే ఆందోళనలు చేస్తాం

బిఆర్ఎస్ నేత మచ్చ వేణుగోపాల్‌రెడ్డి

మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, మార్చి 10,ప్రభాతవార్త : ఉగాది పర్వదినంలోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు రైతులకు రైతు భరోసా అందించాలని లేదంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని మాజీ కౌన్సిలర్, సూడా డైరెక్టర్, బిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు కలకుంట్ల మల్లికార్జున్, నాగరాజురెడ్డి, ఇర్షద్‌హుస్సేన్, దరిపల్లి శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, పొన్నమల్ల రాములతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం కెసిఆర్ రైతులకు సకాలంలో పంట పెట్టుబడి సహాయం కింద రైతు బంధు, సరిపడా యూరియా అందించారని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి పంట సమయంలో రైతు భరోసా ఇవ్వకుండా ఓట్ల వచ్చినప్పుడు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. సకాలంలో యూరియా లభించక రైతులు నరక యాతన అనుభవిస్తున్నారని వాపోయారు. షాపుల లో ఉండాల్సిన యూరియా యాప్‌లోకి వచ్చిందని దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు గిట్టుబాటు ధర అందించలేని దుస్థితిలో సర్కార్ ఉందన్నారు. కందుల కొనుగోలు ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా కొనుగోలుచేసి చేతులు దులుపుకోవడంతో రైతులు మధ్య దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు.పొద్దుతిరుగుడు పంట చేతికి వచ్చిందని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. సమావేశంలో సత్యంరెడ్డి, సయిద్, సాయిచరణ్ గౌడ్, కిట్టు,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్

ముమ్మరంగా కొనసాగుతున్న ప్రజాపాలన

గజ్వేల్, మార్చి 10 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో చైర్మన్ గంగిశెట్టి చందనరవీందర్ పర్యటించారు. ఈ సందర్భంగా టివైఆర్ గార్డెన్ వెనుక భాగంలో ప్రజ్ఞాపూర్ నుండి వచ్చే వరద కాలువ పూర్తిగా నిండిపోవడం వల్ల నీరు నిలిచి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో తక్షణమే స్పందించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు కాలువను తవ్వించి నీటిని తొలగించే చర్యలు తీసుకున్నారు. కాలువను పరిశీలించగా నేరుగా చెత్తను కాలువలో వేయడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోతున్నట్లు అధికారులు గుర్తించి బాధ్యులైన వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిని సందర్శించి పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. అక్కడ ఉన్న యుజిడి సమస్యను పరిష్కరించి ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని అధికారులకు చైర్మన్ గంగిశెట్టి చందన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు రొట్టెల శ్రీనివాస్, కాముని మురళి, బొగ్గుల స్వప్న సురేషన, మర్కంటి భాగ్యలక్ష్మి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తారా ప్రభుత్వ కళాశాలలో 'స్మార్ట్ రీసెర్చ్ వర్క్‌షాప్'

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 10, ప్రభాతవార్త : విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించి ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా తారా ప్రభుత్వ కళాశాలలో 'స్మార్ట్ రీసెర్చ్ వర్క్‌షాప్' నిర్వహించారు. తారా ప్రభుత్వ కళాశాలలో మంగళవారం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం 'స్మార్ట్ రీసెర్చ్ వర్క్‌షాప్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ప్రభ సహాయ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో వివిధ పనులను త్వరగా, ఖచ్చితంగా పూర్తి చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా పాల్గొన్న డా. గజేంద్రబాబు మాట్లాడుతూ, పరిశోధన స్ఫూర్తి ఉన్నప్పుడే విద్యార్థుల మనోవికాసం, ఆలోచనా పరిధి విస్తృతమవుతుందని చెప్పారు. కార్యక్రమ సమన్వయకర్త వీరేందర్ మాట్లాడుతూ, పరిశోధన రంగంలో ముందుకు సాగితేనే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. వాణిజ్య విభాగాధిపతి జ్యోతి మాట్లాడుతూ, ఈ తరహా కార్యశాలలద్వారా విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తి, జిజ్ఞాస పెంపొందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు శ్యాం ప్రసాద్, సవన్య, కృష్ణ, శ్రీనివాస్, సాయి వాణి, నందిని, ప్రవళిక, పావని తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలే లక్ష్యం

-టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు

గజ్వేల్, మార్చి 10 (ప్రభాతవార్త): సామాజిక కార్యక్రమాలు విస్తృతం చేయడమే లక్ష్యమని టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ మండల పరిధిలోని పలు పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. టివైఆర్ ఫౌండేషన్ ద్వారా నాలెడ్జ్ సెంటర్లు, కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫిజికల్‌గా, వర్చికల్‌గా అవసరమైన శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. పోటీ ప్రపంచంలో యువతకు అవసరమైన విజ్ఞానం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం తలకొక్కుల రాజు తన జన్మదినం సందర్భంగా స్థానిక మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పురోహితుల ఆశీర్వాదం తీసుకుంటున్న తలకొక్కుల రాజు

కందిలో ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కందిలో 'ఉల్లాస్ నవభారత్ సాక్షరత'

కంది, మార్చి 10, ప్రభాతవార్త : సామాజిక చైతన్య కేంద్రాలను బలోపేతం చేసేందుకు ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని కందిలోని లక్ష్మీ నగర్ తండాలో 13వ వార్డు సభ్యులు గౌస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వయోజన విద్యాశాఖ ఎస్సీఈఆర్టీ సంయుక్త సారథ్యంలో స్వయం సహాయక బృంధాలకుఉ చదువు నేర్పించడమే లక్ష్యంగా పని చేస్తూ మెరుగైన ఫలితాలు రాబట్టారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఢిల్లీ నుంచి మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. స్వయం సహాయక బృంధంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని బృందం బాధ్యులు పేర్కొన్నారు. వార్డు సభ్యులు గౌస్ మాట్లాడుతూ ఆడపిల్లలు బాల్య వివాహాలు చేసువద్దని, ఉన్నత చదువులు అందుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి జ్యోతి శర్మ, ఎన్‌సిఈఆర్‌టి నుంచి అమ్మ యోగి, డైనా థామస్, రిటైర్డ్ డైరెక్టర్ నాగలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ భాస్కర్, జిల్లా కో-ఆర్డినేటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, వెంకటేశ్వరరావు, జిల్లా కో-ఆర్డినేటర్ బి శిరీష దేవి, ఏపీఎం వెంకట్, కంది మండల ఏపీఎం శివలక్ష్మి, శైలజ, ఎంఈఓ జోగన్న, నాయకులు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుల్‌కల్‌లో ఈజీఎస్ పనులపై ప్రజాదర్బార్

పుల్‌కల్, మార్చి 10, ప్రభాతవార్త: మండలంలో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామి పనులపై ఈ నెల 11న మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని రైతు వేదికలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఆనందమేరి తెలిపాఆరరు. 2024 ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2025 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సామాజిక తనిఖీ నివేదికలు చదివి వినిపిస్తారని వివరించారు. గత పక్షం రోజులుగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామి పథకం పనులపై సామిజక తనిఖీ బృంధం సభ్యులు పర్యటించి పనులను గుర్తించారని గుర్తు చేశారు. ఉపాధి పనులపై అభ్యంతరాలు ఉంటే ప్రజా దర్బార్‌కు హాజరై వివరాలు వివరించాలని ఎంపిడిఓ సూచించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కొండపాక, మార్చి 10, ప్రభాతవార్త : స్వయం పరిపాలన వల్ల విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలు అలవడుతాయని హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండపాకలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తొటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా హర్షిత, డిఈఓగా అరుణ్ కుమార్, ఎంఈఓగా మస్వీర్, హెచ్‌ఎంగా లీల శరణ్య బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, అనిత, అపర్ణ, స్వామి, భార్గవి, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

పుల్‌కల్, మార్చి 10, ప్రభాతవార్త: మండలపరిధిలోని పోచారరం గ్రామంలో మంగళవారం రూ.45 లక్షలతో పలు అభివృద్ధిపనులు నిర్వహించేందుకు భూమి పూజ నిర్వహించి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో సిసి రోడ్డు, ప్రహరీగోడ, మహిళా సమైఖ్య భవన నిర్మాణాలకు పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి 10లక్షలు, మహిళా సమైఖ్య భవన నిర్మాణానికి 10 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి 25లక్షల రూపాయలను మంత్రి దామోదర్ రాజనర్సింహా సహకారంతో మంజూరైనట్లు సర్పంచ్ కొనదొడ్డి శ్రీశైలం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంగెరి మాణిక్యం పాల్గొన్నారు.

పోచారంలో సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న నాయకులు

రసమయిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి, మార్చి 10, ప్రభాతవార్త : మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు అసత్యమని ప్రజలను తప్పుదొవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇథనాల్ ఫ్యాక్టరీ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకొని బిఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ బెజ్జంకి మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అన్యాయానికి గురువుతన్నారని తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీపై తప్పుడు ప్రచారం చేసి లబ్దిపొందాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులకు సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్దిని పట్టించుకోకుండా రాజకీయ లబ్దికోసం అర్థం, పర్థం లేని ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఎఎంసి మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య, మాజీ ఎంపిటిసి రాజమహేంద్ర, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌రావుచ రాములు, శ్రీనివాస్, వంగల నరేష్, బిగుళ్ల దుర్గసుదర్శన్, స్వామి, తిరుపతి, ఓదెలు, భూమయ్య, రాజేందర్, వీరేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు...

చేర్యాల, మార్చి 10, ప్రభాతవార్త : మంగళవారం సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో అంగడిబజారు వద్ద సీపీఐ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఈరి భూమయ్య, మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి, కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు పోనుగోటి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు సుంకోజు రజిత, బింగి పోషయ్య, వెలుగల మల్లయ్య, అందె యాదవ్వ, మల్లవ్వ, కవిత, లచ్చయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

హుస్నాబాద్ రూరల్, మార్చి 10, ప్రభాతవార్త : హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన పోలు బిక్షపతి గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హుస్నాబాద్ బ్రాంచ్‌లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన (పిఎమ్‌జెజెబివై) పథకలో సభ్యత్వం పొందారు. ఈ పథకం కింద ఆయన మరణానంతరం కుటుంబానికి లభించాల్సిన రూ.2 లక్షల భీమా మొత్తానికి సంబంధించిన చెక్కును ఆయన భార్య పోలు రజితకు బ్యాంక్ అధికారులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బ్రాంచ్ మేనేజర్ సంజీవ్ కుమార్, బ్యాంక్ ప్రతినిధి రాజు, గ్రామ సర్పంచ్ లక్ష్మి, బిసి ఎల్లయ్య, సిఎఫ్ఎల్ టీం సభ్యులు సాయికుమార్, అనిల్, అశోక్ పాల్గొన్నారు. వారు చెక్కును అందజేస్తూ ప్రభుత్వ భీమా పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

ఘనంగా క్రిసాలిస్ డే, యంగ్ సైంటిస్ట్స్ ఎక్స్‌పో

హుస్నాబాద్ టౌన్, మార్చి 10, ప్రభాతవార్త : పట్టణంలోని సర్ సి.వి. రామన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రిసాలిస్ డే, యంగ్ సైంటిస్ట్స్ ఎక్స్‌పో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ వంటి పాఠ్యాంశాలకు సంబంధించిన విద్యా-వైజ్ఞానిక నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శనలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల ప్రాముఖ్యత, కాలుష్య నియంత్రణ, వ్యవసాయం, ఖగోళ శాస్త్రం, రక్షణ రంగానికి సంబంధించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. గణిత శాస్త్రానికి సంబంధించి వేదగణితం, సంఖ్యాశాస్త్రం వంటి పద్ధతులను విద్యార్థులు నమూనాల రూపంలో చూపించి ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ తనిఖీ

అక్కన్నపేట, మార్చి 10, ప్రభాతవార్త : మండల పరిధిలోని జనగామ గ్రామం వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సర్పంచ్ బొడ్డు ఈశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి చదువు పరిస్థితి, పాఠాలపై అవగాహన గురించి తెలుసుకున్నారు.పిల్లలు చదువుపై ఎంతవరకు అవగాహన కలిగి ఉన్నారు, ఉపాధ్యాయులు వారికి ఎలాబోధిస్తున్నారు అనే విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి మంచి విద్య అందించాలని సూచించారు. అలాగే విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తీసుకురావద్దని, స్టీల్ బాటిళ్లలో నీరు తీసుకురావాలని పిల్లలకు సూచిస్తూ ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు కూడా చెప్పాలని సూచించారు.

ఘనంగా సీతారామ కళ్యాణం

తొగుట, మార్చి 10, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని శ్రీసీతా రామాంజనేయ దేవాలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా సీతా రామ చంద్రస్వామి కళ్యాణం మదనానందస్వామి, దుర్గాప్రసాద్‌స్వామి ఆశీర్వచనలతో వైభవంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రతి యేటా సీతారామచంద్రస్వామి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు నల్లబెల్లి అంజలి అంజనేయులు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కళ్యాణంలో సర్పంచ్ పాగాల శోభకొండల్‌రెడ్డి, క్యాస పద్మచంద్రశేఖర్, క్యాస రాజకుమార్, పాగాల విజయ యాదవరెడ్డి, బాల్‌రెడ్డి, సిద్ది నరసింహారెడ్డి, సుతారి రమేష్‌చ బాబురావు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాలువ పూడికతీత పనులు ప్రారంభం

బెజ్జంకి, మార్చి 10, ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో పెద్దచెరువు ఎడమ కాలువ పూడిక తీత పనులను సర్పంచ్ కవ్వంపల్లి అశ్వినిశ్రీనివాస్ ప్రారంభించారు. తోటపల్లిలో వచ్చే వర్షాకాలం వరకు ఎడమ కాలువ చివరి ఆయకట్టుకు వరకు సాగునీరు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దయ్యాల ఐలవ్వ, నల్లగొండ రామయ్య, యెన్న వజ్రమ్మ నర్సయ్య, రైతులు చిగుళ్ల ఐలయ్య, ఒగ్గు శ్రీనివాస్, పోలవేణి స్వరూప, ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

నంగునూర్, మార్చి 10, ప్రభాతవార్త : మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఘనపూర్‌లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సత్కరించి మాట్లాడారు. మహిళలు ప్రతి రంగంలో ఉన్నత స్థానాల్లో ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్, ఎపిఎం శ్రీనివాస్, సీసీలు ప్రేమలత, శ్రీనివాస్, పంగ లింగం, మల్లేశం, సిఏలు సులోచన,మాదవి, వివో ఓబీ రజిత, సుకన్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత

గజ్వేల్, మార్చి 10 (ప్రభాతవార్త): ఈనెల 14వ తేదీన జరగబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థిని, విద్యార్థులు సిద్ధంగా ఉండాలని 5వ వార్డు కౌన్సిలర్ మన్నె రూప వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం 5వ వార్డులోని ప్రజ్ఞాపూర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు బాగా రాసి ప్రజ్ఞాపూర్ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చదువులో రాణించాలని, మంచిగా చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎక్కల్‌దేవి కనకరాజు, మెతుకు సాయిబాబా, మెతుకు కరుణాకర్, రాజి ప్రభు, క్యాసారం కృష్ణ, గుండ్ర మధుబాబు, పంబాల ఎల్లం, రామచంద్రం, యూనిస్, దుర్గేష్, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

మర్కుక్, మార్చి 10 (ప్రభాతవార్త): పశువులకు ఉచితంగా ఇస్తున్న గాలికుంటు నివారణ టీకాలను పాడి రైతులు వేయించాలని సర్పంచ్ బి.రాణిమల్లేష్ తెలిపారు. మంగళవారం మర్కుక్‌లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఏ.శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాణి మల్లేష్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను వేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాధవరెడినడ, సతీష్‌గౌడ్, రవి, తీగుళ్ల కనకయ్య, గద్దల రాజు, నాగరాజు, శాతంగారి రవి, విఎల్ఓ భాస్కర్, ఓఎస్ కృష్ణ, గోపాలమిత్రులు రవీందర్, ఆంజనేయులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణలో ఆర్డీవో

రామాయంపేట, మార్చి 10, ప్రభాతవార్త:
రామాయంపేట మున్సిపాలిటీని స్వచ్ఛ పట్టణం గా మార్చేందుకు ప్రతి ఒక్కరు తమవంతుగా కృషి చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. మంగళవారం రామాయంపేట పట్టణంలో 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా మల్లెచెరువుకట్ట వద్ద పారిశుధ్య పను లను ఆమె పర్యవేక్షించి, పరిశీలించారు. మున్సి పల్ కమిషనర్ బి.శ్రావణ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈకార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్‌చైర్మన్ పోచమ్మల నవ నీత, స్థానిక ఎమ్మార్వో రజినీకుమారి హాజరై పారిశుధ్య పనులలో భాగస్వాములయ్యారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు...
అనంతరం మున్సిపల్‌కమిషనర్ శ్రావణ్ పట్టణం లోని మున్సిపల్ నర్సరీని సందర్శించి హరిత హారం సిబ్బందికి మొక్కల సంరక్షణపై పలు సూ చనలు చేశారు. మొక్కలను కాపాడుతూ పట్టణా న్ని మరింతపచ్చగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. తరువాత పట్టణంలోని ఆద్య హో టల్ వంటగదిని పరిశీలించిన కమిషనర్, పరి శుభ్రతపై హోటల్ సిబ్బందికి సూచనలు చేశారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన సరుకుల గడువు తేదీలను (వాలిడిటీ) పరిశీలించి, ఆహారపదార్థాల నిల్వలో నిబంధనలు పాటించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహించినట్లయితే జరిమానాలు విధిస్తామని హె చ్చరించారు. అలాగే పట్టణంలోని కాళ్లగడ్డ శ్మశాన వాటికను సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అవసరమైన మిగిలిన వసతులను త్వరలో ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని రోజువారీ కూరగాయల మార్కెట్‌ను కూడా పరిశీ లించి, మార్కెట్‌లో ఏర్పడే చెత్తను తప్పనిసరిగా మున్సిపల్ చెత్త ట్రాక్టర్‌లోనే వేయాలని వ్యాపా రులకు సూచించారు. కూరగాయల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్‌మేనేజర్ రఘువరన్, కాలేరు ప్రసాద్, చిలుక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజనీకుమారి

పాడి పరిశ్రమను దెబ్బతీసే ఒప్పందాలు రద్దుచేయాలి

-సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న రైతుల దృశ్యం

కొండాపూర్, మార్చి 10, ప్రభాతవార్త:
కొండాపూర్ పాడి పరిశ్రమ ఉత్పత్తులను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.దశరథ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్, జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో చేసుకున్న ఒప్పందాలు దేశంలోని పాడి పరిశ్రమ రైతులకు తీవ్రనష్టాన్ని కలిగించే అవకాశముందని ఆందోళన వ్యక్తంచేశారు. అమెరికానుండి వచ్చే ఉత్పత్తులపై సరైన సుంకాలు విధించక పోవడంవల్ల భారతదేశ రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రవికాంత్, బాల్‌రాజ్, వీరమ్మ, సుభాన్, నత్తయ్య, పాపయ్య, రామస్వామి, మహేష్, సుక్కమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేసవి కూరగాయల సాగుకు ప్రోత్సాహం

-గుమ్మడిదల రైతువేదికలో ఉద్యానశాఖ కార్యక్రమం

గుమ్మడిదల, మార్చి 10, ప్రభాతవార్త:
గుమ్మడిదల రైతు వేదికలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద వేసవి కూరగాయల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో రైతులకు ఉచితంగా కూరగాయల మినీకిట్స్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్, బెంగుళూరు తయారుచేసి అందించగా, రైతులకు పంపిణీ చేశారు. ఆయిల్‌పామ్‌సాగుకు ప్రభుత్వం రూ.50వేలవరకు సబ్సిడీ అంది స్తోందని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, గుమ్మడిదల మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రావాలి

-చైర్మన్ కుమార్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న మండల తహసీల్దార్, మున్సిపల్‌చైర్మన్

గుమ్మడిదల, మార్చి 10, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలో మహిళాదినోత్సవ కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహించారు. మహిళల పురోగతే దేశాభివృద్ధికి బాటవేస్తుందని, మహిళ లు అన్నిరంగాల్లో ముందుకురావాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాల యంలో తహసీల్దార్ పరమేశం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, మహిళా వార్డుకౌన్సిలర్లు, మహిళాసిబ్బంది, స్థానికమహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమాదేవి, ఎస్‌ఐ లక్ష్మీ కాంత్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డుకౌన్సిలర్లు సారెడ్డిగారి పద్మ, తుపాకుల రాధిక, మద్ది సోని, షేక్ గౌసియా, ఆకుల మాధవి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల, గిద్దె విజయలక్ష్మి, చప్పటి పద్మతోపాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయంపై అవగాహన

న్యాల్‌కల్, మార్చి 10, ప్రభాతవార్త:
మండల పరిధిలోని చాల్కి గ్రామంలో మంగళవారం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకంలోభాగంగా రైతులకు డెమో నిర్వహించి తెల్లకుసుమ మినికిట్స్‌లను సబ్సిడీపై పంపిణీచేశారు. ఈ సందర్భంగా మండల వ్యవ సాయ అధికారి ఎన్.అభినాష్‌వర్మ మాట్లాడుతూ జాతీయ ఆహారభద్రత పథ కంలో రైతులకు శనగ విత్తనాలు (ఎన్బీఈజీ-47) హైబ్రిడ్ రకాలను సబ్సిడీ కింద పంపిణీచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు, సాయికిరణ్‌రెడ్డి, నాగేస్, రాజప్పదొర, మునుపటేల్, చంద్రశేఖర్, రియాజ్, అంజన్న, దత్తు, అఖిల్, రమేష్, బాబు, ఇర్ఫాన్, ఓంరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు

-రామాయంపేట ఎస్‌ఐ బాలరాజు

రామాయంపేట, మార్చి 10, ప్రభాతవార్త:
క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తా యని, యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు రావాలని రామాయంపేట ఎస్‌ఐ బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం రామాయంపేట మండలపరిధి లోని ప్రగతిధర్మారం గ్రామంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్న మెంట్‌ను రామాయంపేట ఎస్‌ఐ బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీ రక దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం ద్వారా యువత లో ఐక్యత, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, టోర్నమెంట్ నిర్వాహకులు, యువకులు, క్రీడాకారులు తది తరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

రామాయంపేట, మార్చి 10, ప్రభాతవార్త:
రామాయంపేట మండలం రాయిలాపూర్ రైతువేదికలో రైతులకు ఆత్మ సౌజన్యంతో సహచర అభ్యాసం కార్యక్రమంలో భాగంగా సేంద్రియ వ్యవసా యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామాయం పేట ఇంచార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు సోమ లింగారెడ్డి మాట్లాడు తూ సేంద్రియ వ్యవసాయంతో నేల ఆరోగ్యంకాపాడాలని, భూసారంపెంపు, సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట ఎరువుల లాభాలు, ఘన జీవా మృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, పంచగవ్య తయారీవిధానం, ఉప యోగించే విధానం గురించి రైతులకు వివరించారు. లీవ్ పామ్ డిప్యూటీ మేనేజర్ అశోక్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగు యాజమాన్యం గురించి, డ్రిప్పు సబ్సిడీల గురించి రైతులకి వివరించారు. నిజాంపేట్ మండలంలోని కల్వకుంటగ్రామానికి చెందిన అభ్యుదయ రైతు రాజేశ్వర్‌రెడ్డి అనుభవాలను రైతులతో పంచుకున్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ మండల వ్యవసాయ అధి కారి భరత్‌కుమార్, రామాయంపేట, నిజాంపేట్ మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, గ్రామసర్పంచి గట్టు సుశీల, గ్రామరైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు

చౌటకూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

చౌటకూరు, మార్చి 10, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన చౌటకూరులోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు గాజుల సుభాష్‌బాబు పర్యవేక్షణలో ఒకరోజు ఉపాధ్యాయులైన విద్యార్థులు తోటివిద్యార్థులకు పాఠాలు బోధిం చారు. డిఈఓగా గౌని కమలాకర్, ఎంఈఓగా ఏర్పుల ప్రణీల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా అఖిలేష్‌గౌడ్, సంధ్య, ప్రధానోపాధ్యాయులుగా సా త్విక్, సిఆర్‌పిలుగా తరుణ్, పిఈటిగా రేవంత్‌గౌడ్, ఉపాధ్యాయులుగా మైత్రి, చైతన్య, రచన, అనుష, లక్ష్మీప్రియా, ఆలియజయాన్, అర్ఫత్ అలీ, శివరాజ్, మనస్విని, మీనాక్షిలు వ్యవహరించారు. ఉపాధ్యాయులైన విద్యార్థు లను పాఠశాల బాధ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

కల్హేర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వైద్యశిబిరం

కల్హేర్, మార్చి 10, ప్రభాతవార్త:
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన కల్హేర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 6గురు ప్రత్యేక వైద్య నిపుణులతో ఆరోగ్యశిబిరాన్ని గ్రామసర్పంచి కోడి గంగారాం ప్రారంభిం చారు. శిబిరానికి చేరుకున్న 238మందికి స్త్రీవైద్య నిపుణులు, కంటి, పంటి వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులు పరీక్షలు నిర్వ హించి చికిత్సలు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచి కోడి గంగారామ్, ఉపసర్పంచి మహేష్, వార్డుసభ్యులు నారాయణ, నాయకులు దేవిదాస్, బాల్‌రెడ్డి, డాక్టర్ జెబ షాహిమీన్, డాక్టర్ అనిల్‌రెడ్డి, పిహెచ్‌సి, సిహెచ్‌సి సిబ్బంది పాల్గొనగా సర్పంచి కోడి గంగారాం ఘనంగా సన్మానించారు.

ఐక్యరాజ్య సమితి కార్యక్రమంలో బొంతపల్లి విద్యార్థినికి విజయం

విజయ పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని, ఉపాధ్యాయురాలు

గుమ్మడిదల, మార్చి 10, ప్రభాతవార్త:
సంగారెడ్డి జిల్లాపరిధిలో నిర్వహించిన మోడల్ ఐక్యరాజ్య సమితి కార్యక్ర మం విద్యార్థులకు అంతర్జాతీయ సంబంధాలు, దౌత్యవిధానాలపై అవగా హన కల్పించే గొప్పవేదికగా నిలిచింది. ఈకార్యక్రమంలో ప్రపంచ సమస్య లపై విద్యార్థులు చర్చించి తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. కార్యక్రమం లో బొంతపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని కుమారి సాయిశ్రీదాస్, మార్గదర్శక ఉపాధ్యాయురాలు వి.రాధాతో కలిసి జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచారు. వీరికి త్వరలో ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించనుంది. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పాల్గొననున్నారు. విద్యార్థిని సాధించిన ఈ విజయం పై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

-పశుసంవర్ధక శాఖ ఎడి ఆదిత్యవర్మ

చౌటకూరు, మార్చి 10, ప్రభాతవార్త:
గాలికుంటు వ్యాధి నిర్మూలనకు సమూల చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధకశాఖ జిల్లా సహాయ సంచాలకులు ఆదిత్యవర్మ అన్నారు. మండల పరిధిలోని కోర్పోలులో మంగళవారం పశువైద్య, పశుసంవర్ధకశాఖల ఆధ్వ ర్యంలో పశువులకు ఉచిత గాలికుంటువ్యాధి నిరోధకటీకాల శిబిరాన్ని నిర్వ హించారు. అంతకుముందు పశువులకు ట్రైవీస్‌ను సర్పంచి బచ్చుగూడెం సు నీతాప్రవీణ్‌రెడ్డితో కలిసి ఆదిత్యవర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మండ ల పశువైద్యాధికారి డాక్టర్ విశాల్, సిబ్బంది ప్రభాకర్, గోపాల్ మిత్ర జిల్లా పర్యవేక్షకులు అర్జునయ్య, శంకర్, ఉపసర్పంచి ప్రవీణ్, వార్డుసభ్యులు, మాజీసర్పంచి నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచి ముకుందంముదిరాజ్, నా యకులు పుట్టి మోహన్, సార రాజ్‌కుమార్, ఆర సంజయ్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనకు ఎంపికైన కుసంగి విద్యార్థులు



జిల్లాస్థాయి ఇన్స్పైర్ మానక్‌లో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

టేక్మాల్, మార్చి 10, ప్రభాతవార్త:
జిల్లాపరిషత్ కుసంగి ఉన్నతపాఠశాల విద్యార్థులు తయారుచేసిన రైతు ఫ్రెండ్లీ స్టిక్ అనే పరికరం జిల్లాస్థాయి ఇన్స్పైర్ మానక్ ప్రదర్శనకు ఎంపికైం ది. గైడ్ టీచర్ ఎం.మురళి సహాయంతో విద్యార్థి రామ్‌చరణ్ ఈ పరికరాన్ని రూపొందించారు. ఈసందర్భంగా సైన్స్ టీచర్ మురళి రాత్రివేళల్లో పొలాల కు వెళ్లే రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ధన్య వాదాలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు బి.ప్రసన్నవదన ఉపాధ్యా యులు మురళి, విద్యార్థులు రామ్‌చరణ్, నిఖిల్‌లకు అభినందనలు తెలియ జేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీచర్ మురళి, విద్యార్థు లు రామ్‌చరణ్, నిఖిల్‌లను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండురంగం, అశోక్, శంకర్, రమేష్‌గౌడ్, కళ్యాణి, సుభాష్, నాగేందర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల భూములు లాక్కుంటే ఊరుకోం

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రైతుల పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గుమ్మడిదల, మార్చి 10, ప్రభాతవార్త:
గుమ్మడిదల రైతుల భూములు లాక్కుంటే ఊరు కోమని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహి పాల్‌రెడ్డి హెచ్చరించారు. టిజిఐఐసికి భూములు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పరిశ్రమల కబ్జాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం గుమ్మడిదల పురపాలక సం ఘం పరిధిలోని అన్నారం గ్రామంలో సర్వేనెంబర్ 261 భూముల విషయంలో బాధిత రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ అన్నారం గ్రామంలో సుమారు 588 ఎకరాల ప్రభుత్వ భూమిని టిజిఐఐసి పేరుతో పలు పరిశ్రమలు, ప్రైవేటు బిల్డర్లకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గజంకూడా ప్రైవేటు వ్యక్తులకు వెళ్ల కుండా కాపాడాలని నిర్ణయం తీసుకున్నామని తెలి పారు. ప్రస్తుతం జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో టిజిఐఐసి పేరుతో భూముల వివరాలు సేకరించి పరిశ్రమలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోం దని ఆరోపించారు. అన్నారం గ్రామంలోని సర్వేనెంబర్ 261లో 117 మంది రైతులకు గతంలో పట్టాలు, పాసు బుక్కులు జారీ అయ్యేలా భూములను అధికారిక రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పుడు తప్పుడు రికార్డు లు సృష్టించి భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగు తోందని విమర్శించారు. రైతులు స్వచ్ఛందంగా ఇస్తేనే భూములను స్వీక రించాలని, బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో రైతు లు ఇప్పటికే పాడి పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు మురళి, సంజీవరెడ్డి, సురభి కుమార్‌గౌడ్, చక్రపాణి, కిషన్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సత్తి విజయ భాస్కర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, తుపాకుల రాజు, నరహరి, రైతులు బిక్షపతి, బాలకిషన్, ఐలేష్, దప్పు శ్రీనివాస్, చాకలి పాపయ్య, మాన్యూరి నర్సింగ్‌రావు, దొంతుల బాలమణి బాధితరైతులు, స్థానికనాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవాలి

-మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్

5కె రన్ లో పాల్గొన్న అధికారులు నాయకులు

గుమ్మడిదల, మార్చి 10, ప్రభాతవార్త:
ఆరోగ్యకరమైన జీవనవిధానం అలవర్చుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని గుమ్మడిదల మున్సిపల్‌చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ అన్నా రు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా మంగళవారం ఉద యం గుమ్మడిదల మున్సిపాలిటీకేంద్రంలో 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ 5కె రన్ బొంతపల్లి కమాన్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జెడి శ్రీనివాసరావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అలాగే వార్డ్ కౌన్సిలర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పిహెచ్‌ఎస్‌లో అభివృద్ధిపనులు ప్రారంభం

మరుగుదొడ్లు, వంటగదులను ప్రారంభిస్తున్న సర్పంచి, అధికారులు

న్యాల్‌కల్, మార్చి 10, ప్రభాతవార్త:
మండలపరిధిలోని హద్నూర్‌గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జహీరాబాద్ పట్టణ శివారులోని మహీంద్రా అండ్ మహీంద్రా కర్మాగారం 12లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు, వంటగదులను మంగళవారం సర్పంచి ఎంఆర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కర్మాగారం ప్లాంట్ హెడ్ సతీష్, మండల విద్యాధికారి మారుతిరాథోడ్‌లు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బిఆర్ఎస్ నాయకులు మాతంశెట్టి రాజ్‌కుమార్, సంగారెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యం

పెద్దశంకరంపేట, మార్చి 10, ప్రభాతవార్త:
మండలపరిధిలోని చీలపల్లిగ్రామంలో గ్రామస్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన త్రాగునీటి వాటర్‌ప్లాంట్‌ను మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రాయిని మధుసూదన్ మంగళవారం ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఈ ప్లాంట్ ద్వారా అందించే పరిశుభ్రమైన నీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జగ్గు ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డంప్ యార్డ్ సమస్యపై కమిషనర్‌కు వినతి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అమీన్‌పూర్, మార్చి 10, ప్రభాతవార్త:
అమీన్‌పూర్ ప్రాంతంలోని నివాస ప్రాంతాల మధ్యలో ఉన్న డంప్ యార్డ్ సమస్యపై అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలరెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్య ను వివరించి వినతిపత్రం అందజేశారు. నివాసప్రాంతాల మధ్యలో కొనసాగు తున్న ఈ డంప్‌యార్డ్ కారణంగా పరిసరప్రాంతప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ప్రభా వితమవుతున్నారని ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో మోడీ బిల్డర్స్ కు చెందిన రమేష్, నాగరాజు, టైలర్స్ కాలనీకిచెందిన అరుణ్‌తోపాటు ఇతర స్థానిక నివాసితులు పాల్గొన్నారు. డంప్‌యార్డ్ సమస్యపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్‌చేశారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-కుసంగి గ్రామ సర్పంచి సంగమేశ్వర్‌గౌడ్

టేక్మాల్, మార్చి 10, ప్రభాతవార్త:
ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతన్నలు సద్వినియోగం చేసు కోవాలని కుసంగిగ్రామ సర్పంచి సంగమేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం టేక్మాల్ మండలపరిధిలోని కుసంగిగ్రామంలో వాటర్‌షెడ్ పథకంలోభాగంగా గతంలో డిడిలు కట్టిన 9మంది లబ్ధిదారులకు 75శాతం సబ్సిడీ ద్వారా వచ్చిన బ్యాటరీ స్ప్రేయర్లు, బ్రష్ కట్టర్లు లబ్ధిదారులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి సుబ్బారావు సంబంధిత అధికారులు భగవాన్ రెడ్డి, రాజశేఖర్, రైతు ఉత్పత్తిసంఘం నాయకులు వెంకటేశం, మాజీ ఎంపిటిసి సభ్యులు అంజయ్య, మాజీసర్పంచి మొగిల్‌రెడ్డి, వార్డుసభ్యులు వెంకట్‌గౌడ్, దుర్గయ్య, అనిల్‌గౌడ్, సతీష్, నాయకులు, మాజీప్రజాప్రతిని ధులు డాకూరి లక్ష్మయ్య, ఎనగండ్ల మల్లేశం, పెద్దాపురం భూమయ్య, తలా రి అడివయ్య, వీరారెడ్డి, కిష్టయ్య, పోల్కం శ్రీనివాస్, రవి, సాయిలు, ఆంజ నేయులుగౌడ్, గజానంద్, కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రజాసేవలో 'ఆశాల' పాత్ర కీలకం..

-పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఓ డా.శ్రీరామ్

రామాయంపేట, మార్చి 10, ప్రభాతవార్త:
ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందించడంలో ఆశాకార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డిఎంహెచ్ఓ) డా.శ్రీరామ్ పేర్కొన్నారు. రామాయంపేట మండలం ధర్మారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని(పిహెచ్‌సి) మంగళవారం సంద ర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలోని వైద్య సేవల నిర్వహణపై ఆయన సమగ్రంగా పరిశీలిం చారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిస్టర్‌లను ధృ వీకరించి, వైద్యసేవలు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్ర మాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంత రం నిర్వహించిన ఆశాదినోత్సవ సమావేశానికి హా జరైన డా.శ్రీరామ్ ఆశాకార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. గ్రామస్థులకు ఆరోగ్య సేవ లు సమయానికి అందేలా కృషిచేయాలని, ప్రభు త్వం చేపడుతున్న ఆరోగ్య పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా చూడాలని వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్త లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డా.వైశాలి, వైద్యసిబ్బంది, ఆశా కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలోని రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న డిఎంహెచ్ శ్రీరామ్